క్లుప్తంగా

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళం, పసుపు, కుంకుమ, విభూధితో అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడికి కుమారుడికి ఆర్థికసాయం అందజేస్తున్న గరుడ గ్రూప్ సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరుకు చెందిన గంగాధరం అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం కుటుంబ సభ్యులకు గరుడ గ్రూప్ సభ్యులు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గరుడ గ్రూప్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్సూరెన్సులో జీఎస్టీ ఎత్తేయడంపై హర్షం



సంబరాలు చేసుకుంటున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

శ్రీకాళహస్తి: ఇన్సూరెన్సులకు కేంద్ర ప్రభుత్వం జీరో శాతం జీఎస్టీ విధించడంపై ఎల్ఐసీ ఏజెంట్లు హర్షం వ్యక్తం చేశారు. వారు సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ జీఎస్టీ ఎత్తేయడం వల్ల పాలసీదారులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డివిజినల్ ప్రెసిడెంట్ సుబ్బారావు, కార్యదర్శి సతీష్‌బాబు, నారాయణస్వామి, బాబూరావు, ఈశ్వర్, మణి, అమృత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు జర్కిన్లు వితరణ



సీఐకి జర్కిన్లు, లాఠీలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సోమవారం యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ సంస్థ ప్రతినిధులు జర్కిన్లు, 30 లాఠీలు అందజేశారు. వాటిని సీఐ గోపి స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ సంస్థ ప్రతినిధులు అనేక ఏళ్లుగా పోలీసులకు పలు విధాలుగా సహకారం అందిస్తున్నారని తెలిపారు. గతంలో ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్లు, రేడియం జాకెట్లు, లైటింగ్ బాటిన్సు అందజేశారని వెల్లడించారు.

యాప్‌తో లెక్కలు పారదర్శకం

తిరుపతి రూరల్: ఎండీఎంఎల్ యాప్‌తో లెక్కలు పారదర్శకంగా ఉంటాయని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని ఐదు గ్రామ సమాఖ్యలను పైలట్–1 ప్రాజెక్టుగా 'మన డబ్బులు – మన లెక్కలు' పథకానికి ఎంపిక చేశారు. అందులో భాగంగా తనపల్లి గ్రామ సమాఖ్య సభ్యులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల నగదుకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఎండీఎంఎల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఈ యాప్‌తో ప్రతి సభ్యురాలి సమాచారం, పొదుపు, అప్పు వివరాలు, సంఘం సభ్యులు చేసే ఉత్పత్తులు, సేవలు నమోదు చేసుకో వచ్చన్నారు. సంఘం పూర్తి సమాచారం అందులోనే ఉంటుందని వెల్లడించారు.

సమష్టిగా విధుల నిర్వహణ

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు పోలీసులు సమష్టిగా విధులు నిర్వర్తించాలని అనంతపురం రేంజ్ డీఐజీ షేముషి ఆదేశించారు. సోమవారం తిరుమలలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌లో బ్రహ్మోత్సవాల భద్రతపై సమీక్షించారు. డీఐజీ మాట్లాడుతూ క్రౌడ్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలన్నారు. భక్తులతో ఓర్పుగా సహనంగా మెలగాలని సూచించారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అలసత్వం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీవీఎస్‌ఓ మురళీకృష్ణ మాట్లాడుతూ టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని కోరారు.

కరుణించు మాత శైలపుత్రి













ఆనందభైరవిగా దక్షిణ కాళికాదేవి, బాలాత్రిపుర సుందరిగా మూలస్థాన ఎల్లమ్మ, కనకదుర్గమ్మ, బాలా త్రిపుర సుందరిగా కామాక్షాంబిక అమ్మవారు, సర్వమంగళాదేవి, కమలాంబిక దేవి అలంకారంలో బజారువీధి కన్యకాపరమేశ్వరి

శ్రీకాళహస్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిరోజైన సోమవారం పలు రూపాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో దసరా ఉత్సవాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా కలశ స్థాపన చేశారు. కనకాచలంపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో కూడా కలశ స్థాపన పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కనకదుర్గమ్మ బంగారుకవచంతో దుర్గాదేవిగా, జ్ఞానప్రసూనాంబ శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. పొనగల్‌గంగమ్మ బాలత్రిపురసుందరిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు కమలాంబికదేవిగా, భాస్కరపేట చాముండేశ్వరి బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. తెట్టులో నల్లగంగమ్మ, విశ్వబ్రాహ్మణవీధిలో గంగమ్మ, ముత్యాలమ్మ గుడివీధిలో ముత్యాలమ్మ, నింబజాదేవి, అష్టలక్ష్మి ప్రత్యేక అలంకారాల్లో, ఏడుగంగమ్మల అమ్మవారు శైలపుత్రిగా, కనకాచలం కింద ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు ప్రత్యేకాలంకారంలో దర్శనమిచ్చారు. వేదాంలోని దక్షిణకాళికా దేవి ఆనందభైరవిగా, బీపీఅగ్రహారం గంగమ్మ, పొన్నాలమ్మ బాలా త్రిపురసుందరిగా దర్శనం కల్పించారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని ఆలయంలో ఊరేగించారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులోని శ్రీ గంగమ్మ అమ్మవారి జాతర బ్రహ్మోత్సవాల్లో గంగమ్మను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వేసిన అమ్మవారి ముగ్గు ఆకట్టుకుంది. మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి, అంబలి తీసుకొచ్చి భక్తులకు పంపిణీ చేశారు. కారణిమిట్టకు చెందిన బాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

బాలాత్రిపుర సుందరిగా సర్వమంగళాదేవి

సత్యవేడు: నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వీరభద్రస్వామి ఆలయంలోని సర్వమంగళాదేవిని బాలా త్రిపుర సుందరిగా రూపుదిద్దారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి రెండు జడలు వేసి అలంకరించారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఉదయం అమ్మవారికి హోమం పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

దసరా ఉత్సవాలకు అంకురార్పణ

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయ శరన్నవరాత్రి ఉత్సవాలకు సోమవారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అధికారి నాగరాజు, ఆలయ అర్చకులు సురేష్ తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారికి ఉదయం 8.30 గంటలకు నిర్వహించే అభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.30 చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు ఆలయంలో కలశ స్థాపన చేసి, గణపతి, నవగ్రహ పూజలను చేసి శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కైలాసనాథకోనలో కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు కలశ స్థాపన, హోమాలు, అభిషేకాలను నిర్వహించి, కామాక్షాంబిక అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. తిరువట్యంలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దసరా సందర్భంగా అభిషేకాలు నిర్వహించి, బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను, పసుపు, కుంకుమ అందజేశారు.



బాలాత్రిపురసుందరిగా చెంగాళపరమేశ్వరి



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు సోమవారం బాలాత్రిపురసుందరి అలంకరణలో అమ్మవార్లను అలంకరించారు. వరదయ్యపాళెం చెంగాళపరమేశ్వరి ఆలయంలో, అలాగే అంబూరులోని శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పతాకావిష్కరణలో పాల్గొన్న ఆర్యవైశ్యులు











పూజలు చేస్తున్న అర్చకులు, క్యూలైన్‌లో భక్తులు, కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, గోమాతకు పూజ చేస్తున్న మహిళలు, నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోంది!



నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: అటు యూరియా కొరత, ఇటు పండించిన పంటకు గిట్టుబాటు లేమితో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా నట్టేట ముంచుతోందని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఆయన ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని శాసించే స్థాయిలో ఉండి కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఎరువుల కొరతను తీర్చలేకపోవడం సిగ్గుచేటన్నారు. శ్రీరంగనీతులు చెప్పే సీఎం చంద్రబాబు కేంద్రం నుంచి ఎరువులు తెప్పించడంలో విఫలమయ్యారన్నారు. అసెంబ్లీలో కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలే యూరియా కొరత గురించి నెత్తినోరు కొట్టుకుంటున్నా స్పందన లేదని విమర్శించారు. అంతేకాక రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వలేరు గానీ ఓజీ సినిమా టికెట్లు రూ.వెయ్యికి అమ్మేందుకు కసరత్తు చేయడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వంలో రైతే రాజుగా ఉంటే నేటి కూటమి ప్రభుత్వంలో వ్యవసాయాన్ని దండగగా మార్చారన్నారు. ఉల్లి, వరి, టమాట పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థ పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

కుక్కల బెడదను నివారించాలని నిరసన



పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

- కుక్కల దాడిలో పలువురు చిన్నారులకు గాయాలు
- కుక్కల బెడద తప్పించాలని ఈవోకి వినతి

రేణిగుంట: పట్టణంలోని పాంచాలినగర్‌లో ఆదివారం వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. చిన్నారులు మోహిత్ (9), దిలీప్ (3) సహా ఆరుగురిపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో భయాందోళన చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో సోమవారం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. వారికి జన విజ్ఞాన వేదిక కార్యదర్శి కుప్పుస్వామి, సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. కుక్కల బెడదను నివారించాలని పంచాయతీ ఈవో మాధవికి వినతి పత్రం అందజేశారు. ఎంపీటీసీ రాజేశ్వరి, సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్, ఐద్వా మహిళా సంఘం మండల అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి ఈశ్వరమ్మ మాట్లాడుతూ రేణిగుంటలో కుక్కల సమస్య తీవ్రంగా వున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కుక్కల దాడిలో పిల్లలు, వృద్ధులు గాయపడుతున్నారని తెలిపారు. ఈవో మాట్లాడుతూ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లి సచివాలయంలో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కింద స్విమ్స్ వైద్యులు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చని చెప్పారు. అనంతరం బీపీ, షుగర్, పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోరు, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టివిడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీలక్ష్మి, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, సర్పంచ్ షెహనాజ్ బి, మునికృష్ణ, ఎంపీహెచ్‌ఈవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అత్తూరులో సర్పంచ్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు తేజస్విని, చక్రపాణి రెడ్డి మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో కిరణ్ కుమార్, సీహెచ్‌వో అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ అనూరాధ, కామరాజు, మౌనిక సుమ, మేఘన, పద్మ, చంద్రకళ పాల్గొన్నారు.

ఆలయ సొమ్ము కాంట్రాక్టర్ పాలు

శ్రీకాళహస్తి: ఆలయానికి సబంధించిన సొమ్ము కాంట్రాక్టర్ పాలవుతోంది. రూ.లక్షలు వెచ్చించి భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న షెల్టర్లలో ద్విచక్ర వాహనాలు, కార్లను పార్కింగ్ చేస్తున్నారు. భిక్షగాళ్లు తిష్టవేస్తున్నారు. దీంతో భక్తులకు ఇబ్బందికరంగా మారుతోంది. శ్రీకాళహస్తీశ్వరాలయం రెండవ గేటు నుంచి నాలుగో గేటు మధ్య భక్తులు బయటకు వచ్చే సమయంలో ఎండ, వాన నుంచి రక్షణ కోసం రేకులతో షెడ్ ఏర్పాటు చేశారు. వాటిలో వాహనాలను నిలుపుతున్నారు. గతంలో ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి కార్పెట్లు ఏర్పాటు చేశారు. అవి వర్షానికి తడిచి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. తర్వాత వైట్ పెయింట్ వేశారు. మట్టలతో పందిరి ఏర్పాటు చేవారు. ఇప్పుడు రేకుల షెడ్ ఏర్పాటుచేశారు. తద్వారా ఆలయ సొమ్ము కాంట్రాక్టర్ల పాలవుతోంది. భక్తుల కోసం వేసిన షెడ్లతో కాంట్రాక్టర్లు బాగుపడుతున్నారని సోషల్ మీడియా వేదికగా అనేక విమర్శలు వస్తున్నాయి. గాలిగోపురం పక్కన రోడ్డును వెడల్పు చేశారు. అడ్డంగా బారి కేడ్లను ఏర్పాటు చేశారు. ఇలా రోజు ఏదో ఒక భక్తుల సౌకర్యం పేరుతో ఆలయ డబ్బులను వృథా చేస్తున్నారు. శాశ్వత పరిష్కారాల వైపు మొగ్గు చూపకుండా తాత్కాలిక చర్యలతో భక్తులు సమర్పించిన నగదును వృథా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆధార్ కేంద్రం ఏర్పాటు



నాగలాపురం సచివాలయంలో ప్రారంభమైన ఆధార్ సేవలు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: నియోజకవర్గవ్యాప్తంగా ఆగిన ఆధార్ సేవల గురించి ఈ నెల 22న సాక్షిలో సచివాలయాల్లో ఆగిన ఆధార్ సేవలు అనే కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించింది. ఆ మేరకు నాగలాపురం సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. అలాగే వరదయ్యపాళెంలో సైతం గిరిజనుల కోసం సోమవారం నుంచి ఈ నెల 27 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయమ్మ తెలిపారు.

సెలవు రోజుల్లో పాఠశాల నిర్వహిస్తే చర్యలు



పాఠశాలలోని విద్యార్థులను ఇళ్లకు పంపుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సెలవు రోజుల్లో పాఠశాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో సెలవు రోజు ప్రైవేటు స్కూళ్లు నిర్వహిస్తున్నారని తెలియడంతో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను ఇళ్లకు పంపించి, పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిందని, అవి పూర్తయ్యే వరకు పాఠశాలలను నిర్వహించకూడదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకపోతే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్టీల పొలం ఆక్రమణపై ఫిర్యాదు



డీటీ నాగరాజుకు ఫిర్యాదు చేస్తున్న యానాదు సంక్షేమ సంఘం నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు రెవెన్యూలోని సర్వే నంబర్ 259–1లో ఎస్టీలకు సంబంధించిన రెండు ఎకరాల పొలం ఆక్రమణపై సోమవారం తిరుపతి జిల్లా యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తలపల చెంచుమల్లికార్జునరావు తహసీల్దార్ కార్యాలయంలోని డీటీ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనమనంబేడు రెవెన్యూలో సర్వే 259–1లో ఎస్టీ మహిళ మంగమ్మకు సంబంధించిన రెండు ఎకరాల పొలాన్ని సుధారాణి, రవినాయుడు ఆక్రమించుకున్నారని తెలిపారు. పొలం వద్దకు వెళ్లిన ఎస్టీలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ఎస్టీ మంగమ్మ పొలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని, ఆమెకు అప్పచెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా యానాదుల సంక్షేమ సంఘం చైర్మన్ చెంగల్రాయులు, జిల్లా అధ్యక్షురాలు ఎలుగోటి రేవతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జున, రాములమ్మ, పనబాకులకల్పన, మంగమ్మ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



సత్యవేడు ర్యాలీ నిర్వహిస్తున్న డప్పు కళాకారులు

సత్యవేడు: అర్హులైన డప్పు కళాకారులకు ప్రభుత్వం గుర్తింపుకార్డులు ఇవ్వాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం కోరారు. సోమవారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో డప్పు కళాకారులు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో డప్పు కళాకారులకు ఇస్తున్న రూ.4 వేలు పింఛన్‌ను రూ.7 వేలు చేస్తామని లోకేష్ చెప్పారని, ఆయన ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదంలో మరణించిన డప్పు కళాకారుడికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థికసాయం మంజూరు చేయాలని, జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులు వెంటనే అమలు చేయాలని, జిల్లా కలెక్టర్ గ్రాండింగ్ అకౌంట్స్ నుంచి డప్పు కళాకారులకు డప్పులు, గజ్జెలు, దుస్తులు అందజేయాలని కోరారు. ప్రతి డప్పు కళాకారుడికి నివాస స్థలాలతో పాటు గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీరోడ్డు, నేతాజీరోడ్డు నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఓ త్రివిక్రమరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, డప్పు కళాకారుల సంఘం జిల్లా నాయకుడు వెంకటయ్య, సత్యవేడు సీఐటీయూ ప్రాంతీయ కార్యాదర్శి రమేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అరుణాచలం, డీవైఎఫ్ఐ కార్యదర్శి మురళి, సీఐటీయూ మండల నాయకుడు ముస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కృష్ణయ్య, కేవీపీఎస్ మండల కార్యదర్శి భాస్కర్, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజాసమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌లో ప్రజలు అందజేసిన వినతుల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దారు శ్రీదేవి తెలిపారు. ఆమె సోమవారం కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సర్వేయర్ల పనితీరు బాగలేదని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి పరిష్కరించాలన్నారు. వచ్చిన వినతులను విచారించి, తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, భూసమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. భూసమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, మండల సర్వేయరు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వైర విహారం చేస్తున్న పందులు





అన్నాస్వామిపల్లి రోడ్డులో ఉన్న పందులు

రేణిగుంట: పట్టణంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా పీహెచ్‌సీ సమీపంలో పందులు మరింత ఎక్కువగా ఉన్నాయి. కొందరు పందుల పెంపకం దారులు హోటళ్లలో మిగిలిన ఆహార పదార్థాలను తీసుకువచ్చి రోడ్డు పక్కన వేస్తున్నారు. వాటిని తినేందుకు పెద్ద సంఖ్యలో పందులు అక్కడికి చేరుతున్నాయి. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ మధ్య పందుల సంఖ్య ఎక్కువైందని, పంచాయతీ అధికారులు చొరవ చూపి పందుల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాళహస్తి - సత్యవేడు :
90100 03139